కొనసాగిస్తారా.. వీధిన పడేస్తారా?

- రాష్ట్రంలో అక్టోబర్ నుంచి కొత్త మద్యం పాలసీ
- మద్యం దుకాణాలు ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి సర్కారు మొగ్గు
- ప్రస్తుతం ప్రభుత్వ షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకం



గోనెగండ్లలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యం షాపు

గోనెగండ్ల : కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొందరి పాలిట శాపంగా మారుతున్నాయి. వందలాది మంది చిరుద్యోగుల గురించి స్పష్టత ఇవ్వకుండా వారి జీవితాలను రోడ్డున పడేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. నాడు వలంటీర్ వ్యవస్థ, నేడు మద్యం దుకాణాల్లోని ఉద్యోగులు, రేపు ఎవరో?. ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో ప్రస్తుతం ఆ షాపుల్లో పనిచేస్తున్న వారిని తొలగిస్తారా.. లేక కొనసాగిస్తారా.. అనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీ

ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నాయి. చంద్రబాబు సర్కారు ఆ పాలసీని మార్చేసి అక్టోబరు నుంచి ప్రైవేటుకే దుకాణాలను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది. కొత్త మద్యం పాలసీని ప్రవేశపెట్టనుండడంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న వారిని తొలగిస్తారా.. లేక కొనసాగిస్తారా అనే ఆందోళనలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అక్టోబర్ ఒకటి నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ప్రభుత్వం నూతన మద్యం విధానం రూపకల్పనకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణాలకు బదులు ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ అప్పగించేందుకు యత్నిస్తోంది. దీంతో మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం షాపుల్లో పని చేస్తున్న చిరుద్యోగులు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో నిరుద్యోగులకు ఉపాధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి నిచ్చింది. ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత కలవారిని కలెక్టర్ల ద్వారా నియమించింది. దాదాపు ఐదేళ్లపాటు ఎటువంటి కష్టాలు లేకుండా వారు ప్రభుత్వ దుకాణాల్లో పని చేయడంతో ఆ కుటుంబాలకు జీవనోపాధి లభించింది. ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొస్తుండటంతో అందులో పని చేస్తున్నవారి ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి. గోనెగండ్ల మండలంలో 2 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో మండల కేంద్రం గోనెగండ్లలో ఒకటి, మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఒకటి ఉన్నాయి. ఒక్కొక్క షాపులో ఒక సూపర్ వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్స్, ఒక వాచ్‌మెన్, ఒక స్వీపర్ ఉంటారు. ఒక్కో షాపులో ఆరుగురు పనిచేస్తున్నారు. వీరిలో సూపర్ వైజర్‌కు రూ.19,500, సేల్స్‌మెన్‌కు రూ.16,500, వాచ్‌మెన్‌కు రూ.10వేలు, స్వీపర్‌కు రూ.1500 జీతం ప్రభుత్వం నుంచి అందుతోంది.

గత ప్రభుత్వంలో అక్రమాలకు చెక్

2019కి ముందు టీడీపీ పాలనలో మద్యం దుకాణాల నిర్వహణకు ప్రతి రెండేళ్లకు ఒకసారి టెండర్లు పిలిచేవారు. లాటరీల ద్వారా దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన దుకాణాలకు మంచి డిమాండ్ ఉండేది. అవన్నీ రాజకీయ నాయకుల ఆజమాయిషీలో ఉండేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి ఏ మాత్రం తావు లేకుండా ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు మద్యం దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టింది. అంతేకాకుండా గ్రామాల్లో బెల్టు షాపులకు, సారా అమ్మకాలకు సైతం అడ్డుకట్ట వేసింది.

కూటమి పాలనలో అనిశ్చితి

కూటమి పాలనలో నూతన మద్యం పాలసీ కారణంగా ప్రైవేట్ ఏజెన్సీలు మద్యం షాపులను అప్పగించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. మద్యం పాలసీతో అంతిమంగా లబ్ధి పొందేది కాంట్రాక్టర్లు, కూటమి నేతలేనని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నేతలు మద్యం దుకాణాల నిర్వహణకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇక ప్రభుత్వం మద్యం షాపుల సిబ్బందిని కొనసాగిస్తారా లేక తొలగిస్తారా అనే విషయంపై స్పష్టత లేదు. ఒక వేళ తమను విధులు నుంచి తొలగిస్తే ఆందోళన బాట పట్టక తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు.

కొనసాగించాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్, సేల్స్ మెన్, వాచ్‌మెన్, స్వీపర్‌ల భవిష్యత్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలి. 2019లో జిల్లా కలెక్టర్ ద్వారా తామంతా నియమితులమయ్యాము. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగ భద్రతపై ఆందోళనగా ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం షాపులో పనిచేసే వారందరి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. కాబట్టి ఉద్యోగుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని మద్యం షాపులోనే కొనసాగించాలి. – రామాంజనేయులు, గోనెగండ్ల మద్యం షాపు సేల్స్‌మెన్

నేడు మండల స్థాయి సమీక్ష సమావేశం

కౌతాళం: స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమ మండల స్థాయి సమీక్షా సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి కె.వి.ఎస్.ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ తాజా ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

క్రీడా జట్ల వివరాలను తెలియజేయండి

ఆదోని సెంట్రల్: క్రీడల్లో పాల్గొనే జట్ల వివరాలను తెలియజేయాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ ఆదోని నియోజకవర్గ క్రీడా పోటీలకు సంబంధించి అన్ని పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు తమ పాఠశాల నుంచి ఏ టీమ్స్ వస్తున్నాయో వాటికి సంబంధించిన ఎంట్రీ పర్టిక్యూలర్‌ను సోమవారం మధ్యాహ్నంలోపు 9985716009, 9866494372, 9866566159 నంబర్లకు పంపాలన్నారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు మున్సిపల్ హైస్కూల్‌లో ఫిక్చర్ వేయడం జరుగుతుందన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబంధించి ఇతర విషయాలు చర్చించడం జరుగుతుందని చెప్పారు. మంగళవారం బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. బుధవారం బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. పోటీలన్నీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరుగుతాయన్నారు. సమావేశంలో ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, ఎస్.నరసయ్య, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజగోపురానికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆదోని పట్టణ వాస్తవ్యులు మీనాక్షమ్మ తన భర్త అలసందగుత్తి సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్షను దేవాలయ కార్యాలయంలో ఆదివారం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి వెంకటేష్ తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులు, బాండు, ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకుడు మహాదేవస్వామి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పరిశుభ్రతపై నాటక ప్రదర్శన


పరిశుభ్రతపై ఎర్రకోట హైస్కూల్ విద్యార్థినుల నాటక ప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఎర్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరిశుభ్రతపై నిర్వహించిన నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో పశువులను వాటి యజమానులు విచ్చల విడిగా వదులుతుండటంతో అవి పశుగ్రాసం లభించక ప్లాస్టిక్ లాటి వ్యర్థ పదార్థాలు తిని రోగాల బారిన పడుతున్నాయని, వాటిని ఇళ్లలోనే వుంచుకోవాలని సూచిస్తూ విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఆరుబయట వ్యర్థ పదార్థాలను ప్రజలు పారవేసి అపరిశుభ్రం చేయవద్దంటూ గేయాలు, నృత్యాల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నీరజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏఈ మదన్ కుమార్, మెప్మా సీఎంఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహేష్

ఆదోని రూరల్: మండలంలోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనదారులకు సూచించారు. రికార్డులు సరిగా లేని 15 వాహనాలకు రూ.3,500 జరిమానా విధించామన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదోని రూరల్: ఆశావర్కర్లకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల నాయకులు వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాప్‌ల ద్వారా పనిభారం పెంచడంతో మానసిక వేదనలకు గురవుతున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అక్రమ కమీషన్లను అరికట్టాలి



మార్కెట్‌యార్డ్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మార్కెట్‌యార్డ్‌లో అక్రమ కమీషన్ల దందాను అరికట్టి దళారీ వ్యవస్థను నిర్మూలించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా రైతు సంఘ కార్యదర్శి పంపణ్ణ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మార్కెట్ యార్డ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మార్కెట్‌యార్డ్‌లో రాఘవేంద్ర ట్రేడర్స్, మణికంఠ, శివసాయి అలివీర ట్రేడర్స్ తదితర 13 దుకాణాల కమీషన్ ఏజెంట్లు వేరుశనగ పంటల దిగుబడులు తెచ్చే ట్రాక్టర్లు, ఆటో డ్రైవర్లకు సంచికి రూ.10 నుంచి రూ.20లు కమీషన్ ఇచ్చి ఒప్పందం చేసుకొని తమ దుకాణాల వద్ద దిగుబడులు దింపుకొంటున్నారన్నారు. ఆయా ఉత్పత్తులను విక్రయించిన తరువాత ఆయా ఉత్పత్తుల రైతులకు నూటికి రూ.2లు కమీషన్‌కు బదులు రూ.4లు పట్టుకుంటూ దోచుకొంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా కొందరు దళారీ వ్యాపారాలు నడుపుకుంటున్నారన్నారు. అనంతరం యార్డ్ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు.

శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి


సర్పంచ్ ఇస్మాయిల్, గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దకడబూరు : గ్రామంలో శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు కోరారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో కొద్ది రోజుల క్రితం దళిత మహిళ గోవిందమ్మపై దాడి జరిగిన నేపథ్యంలో ఆదివారం వారు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పరిస్థితులను పరిశీలించి సర్పంచ్ ఇస్మాయిల్, ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడారు. ఆవేశంలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తును అంధకారంలోకి తీసుకెళ్తాయన్నారు. గోవిందమ్మపై చేసిన దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వకంగా, ఐక్యతతో కలసిమెలసి ఉండాలన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనాథ్, సీఐ మంజునాథ్, ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెడికల్ క్యాంపు

ఆదోని అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం సోమవారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లోకేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం మెడికల్ క్యాంపుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవిలతతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ మహాత్మాగాంధీజీ జయంతి వరకు వివిధ రకాల సేవా కార్యక్రమాలను, సేవాయే స్వచ్ఛత అనే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా సోమవారం స్థానిక ఎంసీహెచ్ ఆస్పత్రిలో 60 ఏళ్ల పైబడిన వారికి, పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, నాయకులు మధుసూదన్‌శర్మ, నాగరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికనేత తిక్కన్నకు నివాళి


మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.గనిరాజు

ఆదోని రూరల్: దివంగత విప్లవోద్యమ కార్మిక నేత, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి కె.తిక్కన్న 2వ వర్ధంతిని స్థానిక మంగళ ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కామ్రేడ్ తిక్కన్న వర్ధంతి సభకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.గనిరాజు, తిక్కన్న సహచరిణి సుశీలమ్మ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తిక్కన్న జీవితం విప్లవోద్యమానికే అంకితమయ్యాడన్నారు. తన చివరి శ్వాస వరకు విప్లవ పార్టీలో కొనసాగాడని చెప్పారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నకేశవులు, ఎస్.బాలరాజు, పీడీఎస్‌యూ కె.సోమశేఖర్, ఏపీటీఎఫ్ తిక్కస్వామి, బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి

ఆదోని అర్బన్: ఆదోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 12–12–2023వ తేదీన సీఆర్ నం .213/2023 యూ/ఎస్ 102 సీఆర్‌పీసీ కింద కేసు నమోదైన వాహనాలను యజమానులు సరైన పత్రాలను చూపించి తీసుకెళ్లాలని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ ఆదివారం తెలిపారు. కొద్ది రోజుల తర్వాత వాహనాలను వేలం వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీవీఎస్ విక్టర్, హీరో హోండా, యమహా స్కూటీ, బజాజ్ పల్సర్, బజాజ్ సీటీ 100, టీవీఎస్ ఎక్సెల్ సూపర్, బజాజ్ కవాగ్జీ–02, యమహా స్కూటీ (రెడ్ కలర్), టీవీఎస్ స్టార్ సిటీ (బ్లాక్ కలర్), హీరో గ్లామర్ (బ్లూ అండ్ బ్లాక్ కలర్), యమహా క్రక్స్, బజాజ్ డిస్కవర్, కినెటిక్ బాస్, హీరో ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్ (రెడ్ కలర్), స్కూటీ (బ్లాక్ కలర్), బజాజ్ సీటీ 100 (బ్లాక్ కలర్), హీరో స్ప్లెండర్, జీస్ స్పీడ్ బ్లాక్ మొత్తం 20 మోటార్ సైకిళ్లు ఆయా కేసుల్లో పట్టుబడ్డాయన్నారు. వాటి యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు.

రామాంజనేయులు సేవలు మరువలేనివి

ఆదోని రూరల్: ఉద్యమనేత కె.రామాంజనేయులు సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక చదువుల రామయ్య నగర్ కాలనిలో రామాంజనేయులు 4వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ రామాంజనేయులు పెద్ద ఎత్తున భూ పోరాటం చేసి నిరుపేదలకు సీఆర్‌నగర్‌లో నివాస గృహాలు ఇప్పించేందుకు శ్రమించాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, పార్టీ జిల్లా సమితి సభ్యులు టి.వీరేష్, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు


ముందు భాగంలో పైకప్పు పెచ్చులూడిన ఆర్టీసీ బస్టాండ్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన వర్షాలకు పై కప్పు పెచ్చులూడి పోయింది. మండలంలోని దాదాపు 26 గ్రామాల నుంచి ప్రజలు కోసిగి మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లుతున్నారు. ప్రతి రోజు ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా ఉంటుంది. ప్రయాణికులు బస్సులు కోసం వేచి ఉండేందుకు సీట్లు కూడా ఏర్పాటు చేయలేదు. బస్సులు వచ్చేంత వరకూ కూర్చునేందుకు వీలు లేక వేచి ఉండాల్సి వస్తోంది. బస్టాండ్‌లో కనీసం తాగునీటి వసతి కూడా లేదు. ప్రయాణికులు డబ్బు పెట్టి నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి. బస్సులు ఏవేళకు వస్తాయో చెప్పే నాథులే లేరు.

వైభవంగా దశమి ఉత్సవాలు

- ముస్తాబైన చింతలాముని, నల్లారెడ్డి స్వాములు
- గుర్రపు పల్లకీ సేవతో ప్రారంభమైన ఉత్సవాలు


చింతలామునిస్వామి, నల్లారెడ్డి స్వామి


ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన భక్తుల పాలిట కొంగు బంగారంగా పేరొందిన శ్రీశ్రీ ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈ ఉత్సవాల్లో పిల్లల ఆటవస్తువులు దుకాణాలు, మహిళకు గాజుల షాపులు, రంగుల రాటాన్లు, వివిధ రాకల తినుబండారాల షాపులను ప్రజలను అకట్టుకునే విధంగా ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున 2 గంటలకు గుర్రపు పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం దశమి మహోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే మంచినీటి సమస్య రాకుండా పంచాయతీ వారు మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. దశమి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

దశమి వేడుకలకు గట్టి బందోబస్తు

దశమి మహోత్సవాలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. ఆదివారం డీఎస్పీ, సీఐ గంగాధర్‌తో కలిసి చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారిని దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ వరకు గోనెగండ్లలో జరిగే దశమి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల్లో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 68 మంది పోలీసులు, మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే దేవాలయంలో దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలను దేవాలయం సమీపంలో కేటాయించిన స్థలంలోనే నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశమి సందర్భంగా గ్రామంలో ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, మద్యం సేవించి అల్లర్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ గంగాధర్ ఉన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని లియాఫీ ఆల్ ఇండియా వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి, కడప డివిజన్ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో ఎమ్మిగనూరు లియాఫీ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం సంఘ స్థానిక అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లియాఫీ స్థానిక బ్రాంచ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మధుసుదన్ రెడ్డి, సుధాకర్, ప్రభాకర్, కార్యదర్శిగా జయన్న, ఆర్థిక కార్యదర్శిగా వీరేష్, మహిళా ప్రతినిధులుగా ఇందిరావతమ్మ, సునీతలను ఏజెంట్లు ఎన్నుకున్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు


సోమప్ప సర్కిల్లో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ సుదర్శన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లెసెన్సులేకుండా వాహనాలు నడపడం వలన ఎవరు అసలైన బైక్ యజమానో అర్థం కావడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఇతరుల నుంచి బైక్ కొనుగోలు చేసివుంటే వెంటనే తమ పేరుపై మార్పు చేయించుకోవాలని, లేని పక్షంలో బైక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దొంగ బైకుల విక్రయాలు జరుగుతున్నాయని, అందుకే బైక్ తక్కువ ధరకు వస్తుందని కోనుగోలు చేయవద్దని, ఆర్సీ చెక్ చేసి ఎవరి పేరున బైక్ రిజిస్ట్రేషన్ అయిందో పరిశీలించి తీసుకోవాలని సూచించారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపితే బైక్‌లను సీజ్ చేస్తామని, వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రహదారి శిథిలం.. ప్రయాణం భయం భయం

- గుంతలమయంగా ఎమ్మిగనూరు – కోసిగి రహదారి
- వర్షం కురిస్తే గోతులు కనబడక ప్రమాదాలు
- రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం
- పట్టించుకునే నాథులే కరువు


శిథిలావస్థలో ఎమ్మిగనూరు – కోసిగి ప్రధాన రహదారి

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ రోడ్లను సత్వరం నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం రెండున్నర నెలలైనా నేటికి కనీసం రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించలేదు. ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమయ్యింది. దీంతో వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ రోడ్డుపై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఉండేదే సింగిల్ రోడ్డు ఆపై గోతులు.. వర్షం వస్తే గోతుల్లో నీరు నిలబడి పోతుండటం గోతులు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డును పునర్నిర్మించండి సారు.. అంటూ విద్యార్థులు వేడుకొంటున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

నిత్యం వందలాది వాహనాల రాకపోకలు

కోసిగి, ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుందకు భక్తులు వెళ్లాలంటే ఈరోడ్డే దిక్కు. నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఇలా వందలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు మీదుగా పట్టణానికి వచ్చే వెళ్లే విద్యార్థి బస్సులు సమయానికి చేరుకోకపోతుండటంతో విద్యార్థుల అవస్థలు వర్ణాతీతం. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్లను సత్వరం నిర్మిస్తామని ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలైనా నేటికి కనీసం రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించలేదని గ్రామీణులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .

26 కిలోమీటర్లు.. గంటన్నర ప్రయాణం

ఎమ్మిగనూరు నుంచి 26 కిలోమీటర్ల దూరంలో వున్న కోసిగికి 50 నిమిషాల్లో వెళ్లే బస్సులు రోడ్డు శిథిలం కావడంతో ఒకటిన్నర గంటకు పైగా సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. శిథిల రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఎక్కడ వాహనాలు మరమ్మతులకు గురై ఆగిపోతాయో చెప్పలేని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు వ్యయప్రయాసాలతో మంత్రాలయం మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నారు. కనీసం ఈ రోడ్డుకు శాశ్వత మరమ్మతులైనా చేయాలని, లేదా కొత్త రోడ్డును నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం



ఎమ్మిగనూరు నుండి కోసిగి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైనా ఆర్అండ్‌బీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.విద్యార్థి బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.దీంతో సమయానికి పాఠశాలలు,కళాశాలలు,ఇళ్లకు విద్యార్థులు వెళ్లలేకపోతున్నారు.బస్సు లేని సమయంలో ఆటోల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించే దుస్థితి నెలకొంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరనెలలైనా నేటికి రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలపై దృష్టి సారించకపోవడం శోచనీయం.ఇప్పటికైనా ఈసమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది.
– మహేంద్రబాబు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు